# 34. ఆ రక్తంలోనే ఉంది, ఆ లక్షణం!

నాకు వచ్చిన బాధని బబ్లూగాడితో చెప్పుకున్నాను. బావురుమని ఏడ్చేను.

వారం పదిరోజులయి వచ్చిపడింది యీ చిక్కు. తెల్లారడంతోనే మొదలవుతుంది యీ గొడవ. చీకటి ఉండగానే అమ్మమ్మ లేపేస్తుంది. బతకనిస్తుందా! ఒకటికీ, రెంటికీ, మూడింటికీ, యీ పనులన్నీ గబ్‌గబ్ గబాగబా అయిపోవాలిట. అసలు మూడింటికంటె ఏమిటో తెలుసా? స్నానం! ఇది తెల్లారుఝామున మూడింటికే పూర్తిచేసుకుని కూచునేవారుట రుషులు ఆ రోజుల్లో, మరేం పనీపాటు లేకపోతే సరి. పిచ్చి సన్నాసులు!

పోనీ స్నానం చేసిన వెంటనే బట్టలు కట్టుకోనిస్తారా? ఉహు ముందు అలా కట్టేసుకుంటే తింటూన్నప్పుడు పెరుగూ అన్నం ఆవకాయామీద పడిపోతాయిటకదా, చిన్న లాగుకట్టుకుని గజగజ ఒణుకుతూ పీటమీద కూచోవాలి. ఎదురుగుండా వెండిగిన్నెలో పెరుగూ అన్నం కనపడేసరికల్లా అన్ని కష్టాలు మరచిపోయినట్టు అవుతుంది సుమా! వెంటనే దాని పళంగా నోట్లో దిమ్మరించుకోవాలని ఉంటుంది. ఎలాగో కాస్సేపు ఓర్చుకుంటాను. సమయానికి బిగించకపోతే, అమ్మో ఈ పెద్దవాళ్ళతో పడగలమా!

'ఏంరా ఎంతసేపటికి ముద్ద నోటికెత్తవేం ఏంతక్కువొచ్చిందిట?' మనకి రోజూ ఇదే పనా ఏమిటి, ఎంతకని చెప్తాం? పెరుగూ అన్నంలోకి అరటిపండు అవసరమని యీ పెద్దలు ఎప్పటికి గ్రహిస్తారో కదా! అమ్మ అంటుంది అమ్మమ్మతో 'నోరిప్పి ఒక్క మాట చెప్పడు చూడు దొంగ గాడిద. మీ అల్లుడుగారు కొడుకుకన్న చిన్నవారు మరీ. తెప్పించిన రెండు అరటిపళ్ళూ నిన్న రాత్రే పొట్టని పెట్టుకున్నట్టున్నారు. ఇప్పుడు ఏందారి? ఓ బెల్లం ముక్క పడెయ్యి అమ్మా', అని కేకేస్తుంది ఆఖరికి.

ఏంచెయ్యడం మరి, అప్పుడప్పుడు వీళ్ళని క్షమించక తప్పదుగదా!

'అలాగే బాగా పెద్ద ముక్క వేస్తే ఇవాల్టికి ఎలాగో గడుపుకుంటా ననుకో..... కాని నువ్వే నేను తింటోన్నంత సేపూ ఇక్కడుండాలి. అంతే కాదు. లేడీ మస్కిటో కథ చెప్పాలి అంటాను. 'అబ్బబ్బబ్బ. నిన్నగాక మొన్న కళ్లు తెరిచినవాళ్ళకి సహా ఈ యింట్లో ఒక్కొక్కరికి ఎంతంత పేచీలు బాబూ' అంటూ చెల్లిని అమ్మమ్మకు అప్ప చెప్పి అమ్మ నా దగ్గిరికి వస్తుంది. అన్నం తిన్నాక మూతీ చేతులూ కడిగి తుడిచి పౌడరు వేసి, అమ్మ, నీలం నిక్కరూ తెల్లచొక్కా కడుతుంది. సాక్సూ బూట్లూ తొడుగుతుంది. నూనె రాసి నున్నగా తలదువ్వుతుంది. ఎక్కువైన పౌడరుని పమిట చెంగుతో తుడిచేస్తుంది.

'ఇక దయచేయండి చిన్న దొర గారులుంగారు' అంటుంది. నేను కదల్ను...... రోజూ చెప్పాలా ఏం. ఆ మాత్రం తెలీదూ? ఓరి లంచగొండి వెధవా అంటూ నవ్వుతూ అమ్మ ముద్దు పెట్టుకుంటుంది. 'ఊ సరే. ఇప్పుడు చేశావు గాని యింకెప్పుడూ యిలా ఆలస్యం చేసి మమ్మల్ని విసిగించకు'. అన్నట్టు

చూసి టక్ టక్ మని చప్పుడు చేసుకుంటూ బయల్దేరుతాను. ఒరి ఒరి ఒరే. ఉరేయ్ బుజ్జిగా అని అమ్మ వెనక్కి పిలుస్తుంది. 'ఈ ఒక్కరోజైనా మరచిపోతారేమో' అని ఎంతో ఆశపడతాను. అంతవరకూ గుర్రు పెడుతూన్న నాన్న నన్ను చంపడానికి కాకపోతే కొట్టినట్టు అప్పుడే లేచిపోవాలా? 'తాతకి గుడ్ మార్నింగ్ చెప్పకుండా ఎక్కడికిరా వెడతావ్? ఇంకా నయం మరచిపోయావుకాదు. బుజ్జీ. ఓసారి ఇలారాఅమ్మా' అని పెద్ద కేకపెడతాడు.

ఈ పిలుపులు చాలవన్నట్టు, చెల్లిని ఉయ్యాల్లో వేసి వచ్చిన అమ్మమ్మ గబుక్కునవచ్చి నా చెయ్యి పట్టుకొని, 'పదబాబూ పద. ఇప్పుడే లేచి నెమ్మదిగా కూర్చున్నట్టున్నారు, ఇంటి పెద్ద ఆయనకి దండం పెట్టుకుని మొదలెడితేనే ఏదైనా' అంటుంది.

దండం పెట్టుకోడానికి ఇన్నాళ్ళూ ఈ యింటిపెద్ద మా యింట్లో ఎందుకు లేరో మరి! అసలు తాతయ్యా బామ్మా అల్లప్పుడెప్పుడో ఓసారితప్ప మాయింటికి రానేలేదు. అత్తా వాళ్ళింట్లో ఉండేవారుట. తాతయ్యకి ఏదో జబ్బుట, ఓ పక్కని కాలూ చెయ్యీ పడిపోయిందిట. మా బామ్మే ఆయనకి అంత చాకిరీచేసేదిట. ఇప్పుడూ చేసును. బతికి లేదుకదా మరి.

తాతయ్యకు మాట సరిగ్గారాదు. చూపు సరిగ్గా నిలబడదు. అమ్మమ్మ చేతులు పైకెత్తి అంటుంది.

ఇలా ఎన్నాళ్ళు తీసుకుంటాడో, మహారాజు! ఆ మాట ఎందుకందో నాకు తెలీదుగాని మహారాజు ఆగదిలో ఉన్న సంగతి మా యింట్లో ఏ గదిలో ఉన్నా తెలిసిపోతుంది. అంత కంపుకొడుతుంది ఆ గది! ఏ సీతాకోకచిలక అయినా గార్డెన్‌లోకి వెళుతుంది గాని, లెట్రిన్‌లోకి వెళ్ళదుగదా!

'ఏంరా అక్కడ నిలబడిపోయావేం, నర్సరీలో చదువుతున్నావ్. పొట్టనిండా ఉపాయాలే. రోజా చెప్పాలా, వెళ్ళేముందు తాతయ్యకి నమస్కారం చేసుకువెళ్ళాలని? ఆమాత్రం తెలీదూ!' అంటాడు నాన్న.

ఎంతో ఏడుపు వస్తుంది. ఏం పాపంచేసానని! ఈ చిక్కునుంచి ఎలా తప్పించుకోవాలో తెలీడంలేదు. ఇప్పుడు కొంచెం పెద్దవాణ్ణి అయిపోయేనుగాని ఎప్పుడో మరీ వేరు శనక్కాయి అంత ఉన్నప్పటిమాట. ఇప్పుడిలా హాయిగా నా కాళ్ళమీద నేను నిలబడి లెఫ్ట్‌రైట్ కొడుతున్నాను గాని అప్పుడు కుక్క నడుస్తుంది చూడు, అలా పాకేవాణ్ణిట, అప్పుడన్నమాట, ఏమూటో మోసినట్టు అప్పుడు అమ్మనన్ను ఎత్తుకుని తిప్పేదట. ఇంతెందుకు, ఇప్పుడు చెల్లాయి లేదూ, అదే అవస్థ తలుచుకుంటే ఛ, ఎంత సిగ్గేస్తుందో! ఎవరేనా వస్తే అమ్మ నా చేత ఏవైనా చేయించేదిట. 'ఏదమ్మా బుజ్జీ, దేవుడుకి దండం ఎలాపెడతావో చూపించూ, వెంకటేశ్వరస్వామికీ జో త! ఏడుకొండలవాడికీ జో-త! వడ్డీకాసులవాడికిజో-త అమ్మచంకన ఉండి అన్ని ముక్కలూ స్పష్టంగా విన్నా, నేనేమీ మాట్లాడేవాణ్ణికాను, అమ్మ బతిమాలేదిట.

'నీనోట్లో పంచరదార పోస్తానుగా, ఏదమ్మా, మామయ్యకు నీవిద్దెం చూపించు' వెంటనే రెండు చేతి వేళ్ళూ నెత్తిమాద కలిపేవాణ్ణి, ఆయన నవ్వుతూ 'వెధవకానా, వేలెడున్నావో లేవో అప్పుడే

వ్యాపారదృష్టి వంటపట్టిందిరా నీకు..... ఏదమ్మా యిలా యియ్యి ఒక్క మారు ఎత్తుకు ఇచ్చేస్తానూ.' పీకపోయినా నేనతని దగ్గరికి వెళ్ళడానికి ఒప్పుకునే వాణ్ణి కాను. ఓమారు వెళ్ళి అనుభవించాను. చాలదూ! ముండాకొడుకు, వీడి బతుక్కి ముద్దు పెట్టుకోవడం ఒకటి. మీసాలు గుచ్చుకోడం ఎలాగైనా సద్దుకోవచ్చు. ఆ చుట్ట కంపు ఎవడు భరించగలడు బాబూ..... ఇంకా ఇచ్చింది గాదు. అప్పుడేవస్తున్న పళ్ళు ఏదైనా దొరుకుతుందా అని దురదపెడుతున్నాయి. ముసలివాడి ముక్కు పటుక్కు మనిపిద్దును, గెడ్డం పీకేద్దును!

ఏదైనా చూడ్డానికి బాగుండాలి. నోట్లో పెట్టుకుంటే కరిగిపోవాలి. అందుకే ఆ వీధి చివర పీచుమిఠాయి అమ్మకపు కేక వినపడడమేమిటి, ఇక్కడ పిల్లలం యిలా ఉన్నట్టుండి నేలమీద పడి దొర్లడం మొదలెట్టడమేమిటి, ఒకేసారి జరుగుతాయి. అమ్మో, లేకపోతే ఈ పెద్దవాళ్లు అంతసుళువుగా లొంగుతారనా! పొరుగతని పీచు పీచు మీసాలూ ఉన్నాయి. ఎందుకూ మైలు దూరం కంపుకొడుతూ!

పీచుమిఠాయి కేకతో అంతస్పీడుగానూ వెనక్కి తప్పుకునేవాళ్ళం. ఆడుకున్న రైలాట ఆగిపోయేది. అసలు రైలే ఏ పెట్టి కాపెట్టి విడిపోయి కంటికి కనిపించకుండా దాక్కునేది ఇంతా చేస్తే అది చేత్తో సంచీ పట్టుకున్న 'మాదాకబళం తల్లీ' అనే ముష్టివాడి కేక!

సంచీ బూచాణ్ణి చూస్తే గుండె దడదడలాడడం పూర్తిగా తగ్గిందని ఇప్పుడూ చెప్పలేనుగాని, పీచుమిఠాయి వాడికేక వింటే దొర్లడం మాత్రం బాగా తగ్గించేసాను. పెద్దవాణ్ణి అయిపోయాను కదా.... అసలు నేనిలా ఇప్పుడు హఠాత్తుగా పెద్దవాణ్ణి అయిపోడానికి కారణం నేనుమాత్రం కాదుట!

నాకు చెల్లెలు పుట్టిందట!

నాకంటే నాకు కాదుసుమా! మా అమ్మకి.

'ఏంరా, ఎంతకీ కదలవేం బుర్రపనిచేయ్యడం మానేసిందా ఏం?' అమ్మ మళ్లీ పెద్ద కేక. పక్కనున్న అమ్మమ్మ వైపు చూశాను. ముసుగు సవరించుకుంటోంది. ఎందుకు చెప్మా అలా అస్తమానూ ముసుగు కప్పి అలా కాపాడుకుంటోంది, లోపల ఏం దాచిందో గదా! అని, ఇంతున్నప్పుడు ఎలా కొట్టుకు చచ్చానో ఏముంది, ఏదైనా ఎన్నాళ్లు దాగుతుంది? ఓ రోజు నూతి దగ్గర స్నానం చేస్తూంటే చూద్దును, ఏముంది? ఏంలేదు! తోమి బోర్లించిన గుండు చెంబులా మెరిసిపోతోంది! కొంతమంది అమ్మమ్మలకి బుర్రలేగాని వాటిమీద మరేవీ ఉండవనే విషయం తెలిసింది. కొంతమంది నాన్నలకి బుర్రల లోపల కూడా ఏమీ ఉండవని మొన్ననే తెలిసింది. అమ్మమ్మ విసుక్కుంటూంటే విన్న సంగతి సుమండీ ఇది, పిచ్చివాడు కాకపోతే అమ్మకి మరి పిల్లలు పుట్టకుండా నాన్న ఆపరేషను చేయించుకోడం ఏమిటి చెప్పండి!

సరేసరి, అమ్మకి బుర్రనేదే లేదని ఈ మధ్యనే రుజువయింది. ఏగుమ్మానికో జేరబడి చెల్లాయికి పాలిచ్చుకుంటూ అదే కూచోడమా! ఒకొక్కప్పుడు ఏం జరుగుతుందో తెలుసా, అమ్మ పాలివ్వడమూలేదు, చెల్లాయి పాలు తాగడమూలేదు. అమ్మ ఒళ్లో చెల్లీ, గుమ్మానికి ఆనుకుని అమ్మా, ఒకటే నిద్ర! మొన్న మొన్నటి దాకా మేం మాత్రం పాలుతాగలేదూ, ఇలాగే వీధిన పడిపోయే వాళ్ళమా.

ఛీ!

ఇంతటి గొప్పవాళ్ళు, 'మీ బుర్ర పనిచెయ్యడం మానేసిందా?' అంటూ మమ్మల్ని నిలదియ్యడమా, ఏం న్యాయం! ఈ పెద్దల్లో నిజంగా ఒక్కరికైనా బుర్రా బుద్ధీ ఉంటే పువ్వులా నన్ను తయారుచేసి నన్నాజబ్బు గదిలోకి పంపుతారా! నిజంగా యింట్లో బుర్రున్నది ఎవరికైనా అంటే అది చెల్లాయికి మాత్రమే. ఓసారి ఏం చేసిందో తెలుసా!

మా నాన్న పనిచేస్తున్న ఆఫీసరు పెళ్ళాం చూడ్డానికి కారుమీద మా యింటి కొచ్చింది. దాని ముందు పొరుగింటి మీసాలాయనా, మాధాకబళం సంచీ బూచాడూ ఎంతో నయం, అంత ఘోరంగా ఉంటుంది! ఇంక మావాళ్ళ హడావిడి చూడాలి. దానికి ఎంత మర్యాద చేశారో, ఎన్ని పెట్టేరో, ఎంతలా పొగిడేరో, ఆ మధ్య నా మొక్కు తీర్చడానికి రైలు మీద అన్నవరం వెళ్లేరులెండి. దార్లో పిఠాపురం దగ్గిర పంచదారఫేక్టరీవో ఏదో ఉంది. అబ్బ ఎంత కంపుకొట్టిందో. రైల్లో అందరూ ముక్కు మూసుకున్నారు. ఈవిడగార్ని చూస్తే ముక్కేకాదు, కళ్లే మూసుకోవాలి. అందుకే పక్కింటికి పారిపోయి ఎవరెంత పిల్చినా మరిరాలేదు. ఆ తరువాత చెప్పేరు చెల్లాయి చేసిన పని 'ఎంత ముద్దొస్తూందో' అంటూ ఆవిడ దగ్గిరికి తీసుకుని మెత్తటి పట్టుచీర కొంగు మీద పడుకోబెట్టుకుందిట. ముద్దు చెల్లించేసింది వెంటనే చెల్లాయి. ఒకటికి ఒకటే కాదుట! ఎంత చక్కగా ఆదరించేవే చెల్లాయమ్మా!

మా నర్సరీస్కూలు మేడమ్ ఎంతతెల్లగా ఎంత శుభ్రంగా ఉంటుందో, ఎంతమంచిదో! గోళ్లు కొరుక్కొన్నా, వేళ్లు నోట్లో పెట్టుకున్నా ఎంతమాత్రం ఒప్పుకోదు. జేబురుమాలు మరచిపోయామో ఆరోజు అయిదు పైసల ఫైను పడిందన్నమాటే. బట్టమీద ఒక్క మరక పడనివ్వదు. ఒక్క కాగితం ముక్క కింద ఉండనివ్వదు! 'ఆరు నెలలు మాస్కూల్లో, చదువుకుంటే చాలు మసిబొగ్గయినా మల్లెపువ్వు అయిపోవలసిందే!' అంటుంది మేడమ్.

నిజమే పెద్దయితే నేనలాంటి దాన్ని పెళ్లి చేసుకుంటాను తెలుసా.

అలాంటి స్కూల్లో చదువుతున్నాను, నీట్‌నెస్‌లో ఏ గ్రేడ్ సంపాదించాను. అలాంటిది పొద్దుటేలేచి ప్రతి రోజూ నాకీ పనిష్మెంట్. ఏమిటి! బబ్లూతో చెప్పుకున్నానంటే చెప్పుకోనూ!

ఏంచెయ్యను మరి! బిక్క మొహం వేసుకుని, దిక్కులు చూసుకుంటూ ఎలాగో గదిలోకి వెడతాను. ముక్కుమూసుకుంటే పెద్దవాళ్లు చంపేస్తారు. కళ్లు బాగా కిందికి దించుకుని వెడితే, మంచంకింద ఏమూకుడో, బేసినో, మందు సీసానో తన్నేస్తాను. చచ్చినట్టు ఎలా ఉన్న వాణ్ని అలా వెళ్లవలసిందే. తాతయ్యకు వినపడదుగా. పెద్దకొంతుకతో అమ్మమ్మ అరుస్తుంది. 'చూడండి అన్నయ్యగారూ, మిమ్మల్ని చూడాలని మీ మనవడొచ్చాడు', ఆయన కాస్త కదుల్తాడు. ఈసారి అమ్మవంతు. 'నువ్వుండు అమ్మా....నే సరిగ్గా చెబుతానూ...... ఇదిగో మావగారూ, బుజ్జిగాడు బడికెళ్తున్నాడు. మీకు దండం పెట్టుకుని గాని వెళ్ళనని ఒకటే పేచీ.'

తాతయ్య మొహం చూస్తే అప్పటికీ పూర్తిగా బోధపడినట్టు అనిపించదు ఆఖర్న నాన్న

అందుకుంటాడు:

'నువ్వంటే ఎంతప్రేమా, ఎంతభక్తీ! వద్దంటే వినడుకదా! నీకు గుడ్‌మార్నింగ్ చెప్పుకుంటేగాని ఆ రోజల్లా అదోలా ఉంటుందిట...... వినపడుతోందా?' తాతయ్య తల ఊపుతాడు.

'అక్కయ్యా ఉందిగాని ఎంతచేసినా మనపిల్ల అవదు కదా..... ఇంక యింత వంశానికీ కులదీపకుడు వీడొకడే. నీ ఆస్తింతా, ఇక వీడిదే కదా వింటున్నావా నాన్నా?'

'ఇంకా నమస్కారం చేసుకోవేం, నరికెయ్యాలా ఏం?' అన్నంత కోపంగా చూస్తూ నా చేత, బలిమిని ఆపని చేయిస్తాడు. చూశావా ఎంత వినయంగా చేతులు జోడించాడో అయినా మధ్యని మేం ఎవరంలే, మీరూ మీరూ ఒకటీ.... నీ పేరింటిగాడు కదా ఎవరడ్డగలరు?'

ఇలాసాగుతుంది. ఆరోజు గండం ఏలాగో గడిచిందనుకొని స్కూలు వైపు ఒకటే పరుగు, నేను.

కాని రోజురోజుకీ పెద్ద వాణ్ణయిపోతున్నాను కదా...... విషయాలన్నీ తెగ తెలిసిపోతున్నాయి. ఎన్నాళ్ళు భరించను! ఓనాడు స్కూల్నించి వస్తూ బబ్లూతో చెప్పుకున్నాను. బబ్లూ ఎవరనుకున్నారు? మా ఎదురింటి కుర్రాడు. వాళ్ళ నాన్నకి బజార్లో పెద్ద బట్టలషాపుంది. నేనూ వాడూ నర్సరీ స్కూలుకి కలిసే వెడతాం...... కలిసేవస్తాం... నాకంటే వాడు ఏనాలుగేళ్ళో పెద్దట. వాడిపక్కని నిలబడితే గుండెలదగ్గరకొస్తాను నేను. అయితేనేం మేమిద్దరం ఎప్పుడూ కలిసే ఉంటాం, ఒక దగ్గిరతప్ప.

వాడిక్లాసూ నాక్లాసూ వేరు వేరు కదా, ఓ చోట కూర్చో నివ్వరు, వీళ్ల రూల్సుతగలడ!

నేనేమో ఒకటోక్లాసు.

వాడేమో రెండోక్లాసు.

ఈ తరగతిలో ఉన్నంతసేపూ నాకూ వాడిమీదే ధ్యాస. ఆ క్లాసురూములో వాడికి నా మీదే చూపు.

'ఒరేయ్ బుజ్జీ, ఎలాగా మూడేళ్ళై యిదేక్లాసులో ఉన్నాను. మరో ఏడాది యిక్కడే గడిపేస్తే వచ్చిన నష్టమేమిటి. నేనీయేడు ఫేలయి పోతాన్లే. ఎంచక్కా మనిద్దరం మీదటికి ఒకే క్లాసులో కూర్చోవచ్చు'. 'మరినేను యీ ఏడు ప్యాసవుతానని గ్యారంటీ యివ్వలేనే. ఏందారి!' అన్నాను. ఓనాడు వాడిమాటకి జవాబుగా...... జాలిగా మామాటలు ఎక్కణ్ణుంచి విన్నారో, మా మేడమ్ నవ్వుతూ జవాబు చెప్పేరు. 'ఇంతమంది పిల్లల్ని చూస్తున్నాను గాని మీ కలసికట్టుతనం ఎక్కడో గాని కనపడదర్రా! మీ బాధ తీరే ఉపాయం చెబుతా వినండి. ఒకటో క్లాసూ రెండో క్లాసు గదులమధ్య చిన్న సందులాంటిది ఉంది. చూడండీ అక్కడ కూచోండి మీరిద్దరూ! ఒకటిన్నర క్లాసు అని పేరుపెట్టి ఆ క్లాసు నేను తీసుకుంటాను!' ఎవరుపొగిడితేనేం, ఆట పట్టిస్తే నేం, మా స్నేహం రోజు రోజుకీ పెరిగేది గాని, తగ్గేది కాదు. వారం పదిరోజులై మొదలైన నా బాధ, అందుకని వాడితో చెప్పకుండా యింక ఉండలేకపోయాను. చెప్తూంటే కన్నీళ్లు ఆగలేదు. వరసగా వాడు మూడు ఐస్ ఫ్రూట్లు ఇప్పిస్తేగాని ఆ దు:ఖం కట్టలేదు మరి! 'చూశావా బుజ్జీ, ఇంతవరకూ ఏడుస్తున్న వాడివి ఇప్పుడెలా నవ్వుతున్నావో.... ఏమిటంటావు కారణం? నీ ఏడుపు

ఆపడానికి నేను ముప్పై పైసలు ఖర్చు పెట్టవలసివచ్చింది, ఇవాళ! ఎవరి ఏడుపైనా ఇందుకే. దాన్ని ఆపే మార్గం ఇదే. ఇదొక్కటే.' ఆతర్వాత బబ్లూ ఏవేవో చెప్పాడు. వాడు నాకంటే అంతో ఇంతో పెద్దవాడు. అన్నీనాకు బోధపడ్డాయని చెప్పలేను. వాడు ఏ ఏ మాటలు చెప్పేడో మాత్రం చెప్పగలను. 'మరి ఎక్కడ్నించి వచ్చిందోగాని నీకూ అదృష్టి బాగానే ఒంట పట్టింది. స్కూలుకి వస్తున్నప్పుడూ, పోతున్నప్పుడూ మనం దార్లో ఏజీళ్లో, ఊరేసిన ఉసిరికాయలో, కొబ్బరుండలో కొనుక్కుతింటుంటాం కదా. తిన్నప్పుడు ఇద్దరం సరదాగా కలిసే తింటున్నాం. కొన్నప్పుడు మాత్రం నేనే కొంటున్నాను. అవునా? నేను తెల్లబోతూ తల ఊపేను.

'తరతరాల్నుంచీ మేం వ్యాపారస్థులం. చిన్నప్పట్నుంచీ మాకిందులో ట్రెయినింగ్ యిస్తారు. ఇవేవీ నీకు లేవు. అయినా పక్షికి రెక్కలొచ్చినంత సుళువుగా నీకీ విద్య పట్టుబడిపోయింది.'

బబ్లూ చెబుతున్నదేమిటో నాకు అర్థంకాలేదు. కన్నీళ్ళు ముంచుకొచ్చాయి.

'ఒరే అట్టే బుడిబుడి దుఃఖాలు వెళ్ళగక్కక నే చెప్పేది విను. మా లింగరాజు మావయ్య నీకు తెలుసుగా! ఈమధ్య అతని కాళ్లు వాచిపోయాయి. రాత్రి అయేసరికి సలుపూ పోటూ ఎక్కువై గిలగిల్లాడి పోతాడు. తొడ నుంచి మడమ దాకా కాళ్ళతో నన్ను తొక్కమంటాడు. నిలబడి కసిదీరా తన్నాలననుంటుంది గాని తొక్కాలని ఉంటుందా ఎవరికైనా? మామయ్యది ఎలుగుబంటి అవతారం, చెమటకంపు సింగారం. అయితేనేం, సేవచేస్తూనే ఉన్నాను. ఎందుకో తెలుసా?

'ఎందుకూ? అన్నాను నోరు వెళ్ళబెట్టి.

' ఆ అరగంట పాదసేవకీ రూపాయి యిస్తాడు గనుక!'

'నిజం! రోజుకి రూపాయే? అంతానీకే? నా మీద ఒట్టూ?'

'అవును. నాకింకా ఒక్కరూపాయే. మీ తాత ఎంచక్కా ఇన్ని రూపాయిలు యిస్తాడు నీకు. అందుకనే ఇక బ్రతకడని తెలిసేదాకా మీ అత్తయ్య చేత చచ్చీ చాకిరీ చేయించి, ఆఖరిరోజుల్లో ఎంతో ఆప్యాయంగా మీ ఇంటికి తీసుకొచ్చేశారు. మీ అమ్మా నాన్నా ఎంతో విసుక్కుంటూ చాకిరీ చేస్తూ, ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఒక్క రూపాయి డబ్బులకోసం ఒళ్ళు హూనం చేసుకుంటున్నాను నేను. అంత ఆస్తి చేతికి వస్తూంటే రోజుకో శాల్యూట్ పారెయ్యడానికి తీసి దిగదీసిందిరానీకు, దొంగలమ్మిడికే?'

ఫైట్‌మని ఒక్కటిచ్చుకున్నాడు బబ్లూ. ఇందాక బతిమాలితే ఏడుపు ముంచుకొచ్చింది నాకు. ఇప్పుడోటి తగిలిస్తే నవ్వొచ్చింది. అయినా ఊరుకోలేక ముక్కు మూసుకుని చూపించాను, ఇదెలా భరించనన్నట్లు.

'చూడూ, కళ్ళూ ముక్కూ మూసుకుని గుమ్మంలోనే సాష్టాంగ నమస్కారం పెట్టిపో. మీ పెద్దలు పొంగిపోతారు. మీ ఇంటిపెద్ద లొంగిపోతాడు. మీరంతా తరిస్తారు!' అన్నాడు బబ్లూ పకపక నవ్వుతూ.

★